www.kalamdaily.com

Follow on:
Kalamtelugu

# కలం
ప్రజల గళం...

24-02-2026, మంగళవారం పేజీలు: 2

360° SINGLE TOPIC

## ఓటీటీ కంటెంట్ – క్రైమ్స్

హైదరాబాద్‌లో భార్యను ముక్కలు ముక్కలుగా నరికి చంపాడో మాజీ జవాన్.. డెడ్‌బాడీ ముక్కలను కుక్కర్‌లో ఉడకబెట్టి, ఆపై ఎముకలను పొడి చేశాడు!

ఢిల్లీలో లివింగ్ పార్ట్‌నర్‌ను ముక్కలుగా నరికి ఫ్రిడ్జ్‌లో దాచిపెట్టాడో వ్యక్తి!

శత్రువులను చంపడానికి ఓ వ్యక్తి క్లోరోఫామ్, ఇతర పాయిజన్ టెక్నిక్స్ ఉపయోగించాడు.

... ఈ దారుణాలన్నింటికీ ఓటీటీల్లో వచ్చిన క్రైమ్/థ్రిల్లర్ కంటెంటే కారణం. ఇవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే!



ఓటీటీలు వచ్చాక దేశవ్యాప్తంగా క్రైమ్స్, సైబర్ క్రైమ్స్ పెరిగిపోయాయి. చాలా నేరాలకు ఓటీటీల్లోని సిరీస్‌లే ఆధారమవుతున్నాయి. నేరం ఎలా చేయాలి? దాని నుంచి తప్పించుకునేందుకు ఆధారాలను ఎలా మాయం చేయాలి? అనేది కళ్లకు కట్టినట్టుగా వెబ్ సిరీస్‌లు చూపిస్తున్నాయి. ఓటీటీ కంటెంట్ ద్వారా తాము ప్రభావితమవుతున్నామని 65 శాతానికి పైగా యువత చెప్పడం, గత ఐదేండ్లలో 'కాపీ క్యాట్ క్రైమ్స్ (సినిమాలు/సిరీస్‌లు చూసి చేసే నేరాలు)' దాదాపు 20 శాతం పెరగడం.. ఓటీటీలు నేరాల ట్రైనింగ్‌కు అడ్డాగా మారాయని స్పష్టం చేస్తున్నాయి.

ఓటీటీ కంటెంట్ కారణంగా క్రైమ్స్ పెరిగిపోతున్నాయని పోలీస్ రికార్డులు స్పష్టం చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వ చర్యలు తూతూమంత్రంగానే ఉన్నాయి. ఎలాంటి ఫిల్టర్, సెన్సార్ లేకుండానే వెబ్ సిరీస్‌లు డైరెక్ట్‌గా నట్టింట్లోకి వస్తున్నాయి. వాటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం.. ఓటీటీ సంస్థలే స్వయంగా నియంత్రణ పాటించాలని అంటున్నది. ఇది 'దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్టే..' అన్న వాదన వినిపిస్తున్నది. లాభాలే పరమావధిగా పనిచేసే ఓటీటీ సంస్థలు తమ కంటెంట్‌ను సెన్సార్ ఎందుకు చేసుకుంటాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్రైమ్ ట్యూటోరియల్‌గా మారిన ఓటీటీలపై

కలం 360 డిగ్రీస్ స్పెషల్..

తెలంగాణ బ్యూరో, కలం

### ఫిల్టర్ లేదు.. సెన్సార్ లేదు

### కట్టడి చేయడంలో కేంద్రం విఫలం

### పిల్లల మానసిక ప్రవర్తనపై తీవ్ర ప్రభావం

### వెబ్ సిరీస్‌లు చూసి క్రైమ్స్‌కు తెగబడ్తున్న యూత్

# ఓటీటీ కంటెంట్ ఔటాఫ్ కంట్రోల్

## నట్టింట్లోకి నేరుగా వచ్చేస్తున్న క్రైమ్, బోల్డ్ సిరీస్‌లు

### బిగ్‌ఫ్లిక్స్.. ఇండియా తొలి ఓటీటీ




ఓటీటీ అంటే.. (ఓవర్ ది టాప్). మొదటి ఓటీటీ విప్లవకర్త నెట్‌ఫ్లిక్స్. 1997లో కేవలం డీవీడీల అద్దె సర్వీస్‌గా మొదలై.. 2007లో ఫస్ట్ టైమ్ ఆన్ లైన్ స్ట్రీమింగ్ సేవలను ప్రారంభించింది. ఇదే ప్రపంచంలో ఓటీటీకి పునాది. రిలయన్స్ ఎంటర్ టైన్‌మెంట్ ద్వారా వచ్చిన 'బిగ్‌ఫ్లిక్స్' ఇండియాలో మొదటి ఓటీటీ ఫ్లాట్‌ఫామ్. 2008లో ఇది ప్రారంభమైంది. 2010లో నెక్స్–జీ–టీవీ అనే మొబైల్ టీవీ యాప్ వచ్చింది. 2015–16 నాటికి, ఇండియాలో ఓటీటీ దశమారిపోయింది. 2015లో డిస్నీ+హాట్‌స్టార్ లాంచ్ అయింది. అది తర్వాతి కాలంలో జియోహాట్‌స్టార్‌గా మారింది. 2016లో నెట్ ఫ్లిక్స్, అదే ఏడాది అమెజాన్ ప్రైమ్ వచ్చింది. 2016లో జియో రాకతో డేటా ధరలు విపరీతంగా తగ్గడం ఓటీటీలకు వరంగా మారింది.

### యూజర్లు @50 కోట్లు

- ఇండియాలో ఓటీటీ యూజర్లు 2026 నాటికి 50 కోట్లకు పైనే. వీరిలో దాదాపు 15 కోట్ల మంది పెయిడ్ సబ్ స్క్రైబర్లు. ఓటీటీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ.25వేల కోట్లకు పైనే.
- 2008లో ఒక చిన్న ప్రయోగంగా మొదలైన ఓటీటీ... నేడు సినిమా ఇండస్ట్రీకి సమానంగా ఎదిగింది. పెద్ద హీరోలు కూడా ఓటీటీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆదరణ పెరిగేకొద్దీ దానిపై నియంత్రణ కరువైంది. సామాజిక సమస్యలు కూడా అంతే వేగంగా పెరుగుతున్నాయి.

రంగారెడ్డి జిల్లాకు చెందిన మాజీ జవాన్ గురుమూర్తి.. తన భార్యను హత్య చేసి, డెడ్‌బాడీని ముక్కలు చేశాడు. వాటిని కుక్కర్‌లో ఉడకబెట్టి, ఎముకలను పొడి చేసి చెరువులో పడేశాడు. 'డెక్స్టార్' అనే క్రైమ్ థ్రిల్లర్ చూసి నేరం చేసినట్టు విచారణలో తేలింది.

'మనీ హేస్ట్' సిరీస్ చూసిన హర్యానా, యూపీలోని యువకులు.. ముసుగులు వేసుకుని ఎర్నాకులంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో దోపిడీకి ప్రయత్నించి పట్టుబడ్డారు. సిబ్బందిని కట్టేసి, సీసీ టీవీ కెమెరాలను ధ్వంసం చేసే పద్ధతిని ఆ సిరీస్ నుంచి నేర్చుకున్నట్లు నిందితులే స్వయంగా పోలీసుల ముందు అంగీకరించారు.

'బ్రీత్: ఇన్ ది షాడోస్' వెబ్ సిరీస్ చూసి.. 2022లో ఢిల్లీలో ఓ వ్యక్తి తన శత్రువులను చంపడానికి 'క్లోరోఫామ్', పాయిజన్ టెక్నిక్స్ వాడాడు.

'డెకార్డ్' సైబర్ క్రైమ్ వెబ్ సిరీస్ రిలీజ్ అయ్యాక ఫిషింగ్ నేరాలు, డార్క్ వెబ్ వాడటం వంటివి పెరిగాయని సైబర్ క్రైమ్ నివేదికలు చెప్తున్నాయి.

'బ్రేకింగ్ బ్యాడ్' వెబ్ సిరీస్ చూసి డ్రగ్స్ తయారీ నేర్చుకున్నట్లు పలువురు నిందితులు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు.


సామాన్యులను అప్రమత్తం చేయడానికి 'జామతారా' సైబర్ క్రైమ్స్ వెబ్ సిరీస్ తీసినా.. దురదృష్టవశాత్తు దాని ఆధారంగా కొత్త మోసాలకు పాల్పడుతున్నారు.

2022లో ఢిల్లీలో జరిగిన శ్రద్ధావాకర్ హత్య దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. నిందితుడు ఆమెను చంపి ముక్కలుగా కట్ చేసి ఫ్రిడ్జ్‌లో దాచిపెట్టాడు. అమెరికన్ సిరీస్ 'డెక్స్టార్' ఆధారంగా ఈ క్రైమ్ చేశాడు.

### సిరీస్‌లు చూసి క్రైమ్స్



శ్రద్ధావాకర్




### దేశంలో 60కి పైగా..

దేశవ్యాప్తంగా ప్రస్తుతం 60కి పైగా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులో ఉన్నాయి. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియో హాట్‌స్టార్, యాపిల్ టీవీ ఇండియాతో పాటు గ్లోబల్‌గానూ టాప్‌లో ఉన్నాయి. జీ5, సోనీ లివ్, సన్ నెక్స్ట్ తదితర ఓటీటీలు నేషనల్ ప్లేయర్స్ కేటగిరీలో వస్తాయి. మరికొన్ని రీజినల్ లాంగ్వేజ్‌లో పుట్టుకొచ్చాయి. వీటిలో ఆహా, ఈటీవీ విన్ ఉన్నాయి. హిందీ తర్వాత అత్యధిక డిమాండ్ ఉన్న రెండో భాష తెలుగు.

### 15-34 ఏండ్ల వాళ్లే 70 శాతం మంది

ఓటీటీలను ఎక్కువ చూస్తున్నవాళ్లలో టీనేజర్లు, యువత ఉంటున్నారు. 15 నుంచి 24 ఏండ్ల వయసు వారు 42 శాతం మంది చూస్తుంటే.. 25 నుంచి 34 ఏండ్ల వారు 38 శాతం మంది చూస్తున్నారు. అంటే 15 నుంచి 34 ఏండ్లవాళ్లే ఎక్కువగా ఓటీటీల్లో మునిగితేలుతున్నారు.





### పల్లెలనూ ముంచెత్తుతున్నాయి

పట్టణాల్లోనే కాదు పల్లెలనూ కూడా ఓటీటీ ముంచెత్తుతున్నది. అందులోని కంటెంట్ కూడా వాడవాడకూ పాకుతున్నది. 2026 ప్రారంభం నాటికి గ్రామాల్లో ఓటీటీ వినియోగం 40 శాతం పెరిగింది. దేశవ్యాప్తంగా 95.8 కోట్ల మంది యాక్టివ్ ఇంటర్నెట్ యూజర్లు ఉండగా.. అందులో 57 శాతం (54 కోట్లు) మంది గ్రామాల్లోనే ఉన్నారు. పల్లెల్లో ఇంటర్నెట్ వాడేవాళ్లలో 65 శాతం మంది ఓటీటీ కంటెంట్ చూస్తున్నారు.




మీ పిల్లలు చూస్తున్నారా.. జాగ్రత్త!

2లో..

కలం
ప్రజల గళం...
24-02-2026, మంగళవారం
360° SINGLE TOPIC

# ఓటీటీ కంటెంట్ – క్రైమ్స్

## కోపింగ్ మెకానిజం గాయబ్

- నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదికల ప్రకారం.. ఇండియాలో నేరాల రేటు పెరగడానికి ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ వేదికగా రిలీజ్ అవుతున్న సినిమాలు, వెబ్ సిరీస్‌లు కూడా కారణమని తేలింది. 18 నుంచి 25 ఏండ్ల మధ్య యువత ఓటీటీలో వస్తున్న కంటెంట్, ఇంటర్నెట్ ద్వారా ప్రభావితం అవుతున్నారని పలు రాష్ట్రాల పోలీసులు గుర్తించారు.
- నేర కథల పట్ల ఆకర్షితులయ్యేవారు క్రమంగా కోపింగ్ మెకానిజం (మానసిక ప్రశాంతతను) కోల్పోతున్నారు. చిన్న సమస్యలకు కూడా హింసాత్మక పరిష్కారాల వైపు మొగ్గు చూపుతున్నారని 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్'(నిమ్హాన్స్) వంటి సంస్థల నిపుణులు అభిప్రాయపడ్తున్నారు.
- గతంలో నేరం చేయడానికి భయపడేవారు.. ఇప్పుడు ఓటీటీల ద్వారా పోలీసుల ఇన్వెస్టిగేషన్ పద్ధతులు (ఫోరెన్సిక్, సైబర్ ట్రాకింగ్) ఎలా ఉంటాయో ముందే తెలుసుకుంటున్నారు. అంటే, పోలీసుల కంటే ఒక అడుగు ముందే ఉండటానికి వెబ్ సిరీస్‌లు, సినిమాలు సాయపడుతున్నాయి.
- నేర ప్రవృత్తి ఉన్నవారికి ఓటీటీ కంటెంట్ ఒక 'బ్లూ ప్రింట్'గా పని చేస్తున్నది.

## నో సెన్సార్



మనం థియేటర్లలో చూసే సినిమాలకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) సర్టిఫికేట్ ఇస్తుంది. కానీ, ఓటీటీ కంటెంట్‌కు సీబీఎఫ్‌సీతో సంబంధం లేదు. కేంద్రం 2021లో 'ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్' తీసుకొచ్చింది. దీని ప్రకారం.. ఓటీటీలు తమను తాము నియంత్రించుకోవాలి. ఓటీటీ కంటెంట్‌ను సెన్సార్ చేసే అధికారం బోర్డుకు లేదు.

### మూడంచెల నియంత్రణ వ్యవస్థ

**లెవల్ 1:** ఓటీటీ సంస్థే స్వయంగా ఒక 'గ్రీవెన్స్ ఆఫీసర్'ని నియమించుకోవాలి. ఎవరైనా కంటెంట్‌పై ఫిర్యాదు చేస్తే 15 రోజుల్లో పరిష్కరించాలి.

**లెవల్ 2:** ఓటీటీ సంస్థలన్నీ కలిసి ఒక 'సెల్ఫ్ రెగ్యులేటరీ బాడీ'ని ఏర్పాటు చేసుకుంటాయి. దీనికి రిటైర్డ్ జడ్జి నేతృత్వం వహిస్తారు.

**లెవల్ 3:** కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పర్యవేక్షణ ఉంటుంది. ఏదైనా కంటెంట్ దేశ భద్రతకు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం దాన్ని తొలగించే అధికారం కలిగి ఉంటుంది.

## సెన్సార్ బోర్డు ఏం చేస్తున్నది?

- ఓటీటీ అనేది పర్సనల్ వ్యూయింగ్ (వ్యక్తిగతంగా చూసేది). థియేటర్ అనేది పబ్లిక్ ఎగ్జిబిషన్. చట్టం ప్రకారం పబ్లిక్ ఎగ్జిబిషన్‌కే సెన్సార్ వర్తిస్తుంది.
- వెబ్‌సిరీస్, ఫిల్మ్ మేకర్స్ కోర్టులకు వెళ్లి 'మా భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకుంటున్నారు' అని వాదిస్తారు.
- నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ వంటివి అంతర్జాతీయ సంస్థలు. ప్రపంచవ్యాప్తంగా ఒకే కంటెంట్ ఉండాలని కోరుకుంటాయి.
- ప్రస్తుతం ఓటీటీలకు 'ప్రీ-సెన్సార్షిప్' (విడుదలకు ముందే కట్ చేయడం) లేదు. కేవలం 'పోస్ట్ -సెన్సార్షిప్' (ఫిర్యాదు వస్తే తొలగించడం) మాత్రమే ఉంది. దీంతో నేర ప్రవృత్తిని ప్రేరేపించే కంటెంట్ సులభంగా ప్రజల్లోకి వెళ్తున్నది. సినిమా మాధ్యమానికి ఉన్నట్టే ఓటీటీకి కూడా ఒక స్వతంత్ర సెన్సార్ బోర్డు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## సైబర్ మోసాలకు పునాది..




సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పోలీస్ రిపోర్ట్స్ ప్రకారం.. ఓటీటీ కంటెంట్ సైబర్ నేరగాళ్లకు స్ఫూర్తినిస్తున్నది. సైబర్ క్రైమ్ తరహా సిరీస్‌లు వచ్చాక దేశ వ్యాప్తంగా కాల్ సెంటర్ మోసాలు, కేవైసీ అప్‌డేట్ పేరుతో చేసే మోసాలు పెరిగాయి. గతంలో డార్క్ వెబ్ అంటే ఏంటో తెలియదు. కానీ డార్క్ వెబ్ ద్వారా డ్రగ్స్ అమ్మడం, ఆయుధాలు కొనడం, ఇతరుల సోషల్ మీడియా అకౌంట్లు హ్యాక్ చేయడం, వాళ్ల ఫొటోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేయడం వంటి పద్ధతులను క్రైమ్ సిరీస్‌ల్లో చూపిస్తున్నారు.

- టెక్ థ్రిల్లర్ సిరీస్‌లు చూసిన ఢిల్లీలోని ఓ గ్యాంగ్ సిమ్ కార్డులను ఎలా క్లోన్ చేయాలో నేర్చుకుని కోట్ల రూపాయలు కొల్లగొట్టింది.
- స్పై థ్రిల్లర్ సిరీస్‌లు చూసి.. సోషల్ మీడియాలో అందమైన అమ్మాయిల పేరుతో ఫేక్ అకౌంట్లు తెరిచి.. హనీ ట్రాప్‌తో అధికారులను బుట్టలో వేసుకుని రహస్యాలు సేకరిస్తున్నారు. ఈ తరహా వెబ్ సిరీస్‌లు ఓటీటీల్లో ఎక్కువ పాపులర్ అయ్యాయి.
- హ్యాకింగ్ మూవీలు చూసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం సినిమాల్లో చూసినట్లుగా వైరస్‌లను పంపి కంపెనీల డేటాను లాక్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

## చట్టంలో లొసుగులు

థియేటర్స్‌లో రిలీజ్ అయ్యే సినిమాలకు సీబీఎఫ్‌సీ సర్టిఫికేషన్ ఉన్నట్లు.. ఓటీటీ కంటెంట్‌ను విడుదలకు ముందే తనిఖీ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్రం కేవలం ఐటీ రూల్స్ 2021 ద్వారా సంస్థలే తమను తాము నియంత్రించుకోవాలని అంటున్నది. ఇది 'దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్లు' అవుతుంది. ఏదైనా నేరం జరిగినప్పుడు లేదా తీవ్రమైన వివాదం తలెత్తినప్పుడు మాత్రమే కేంద్రం హెచ్చరికలు జారీ చేస్తున్నది. 2025లో 25 ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌ను ప్రభుత్వం బ్లాక్ చేసింది. అయితే, అవి అప్పటికే సమాజంలోకి విషపూరిత కంటెంట్‌ను పంపిన తర్వాత తీసుకున్న చర్యే. ముందే అడ్డుకునే పటిష్టమైన ఫిల్టర్లు ప్రభుత్వం వద్ద లేవు. ఐటీ యాక్ట్ 2021లో లొసుగులు ఉన్నాయి. చట్టంలో 'అభ్యంతరకరం', 'అసభ్యత' అనే పదాలకు స్పష్టమైన నిర్వచనాలు లేవు. ఓటీటీ సంస్థలు క్రియేటివ్ ఫ్రీడమ్ పేరుతో హింసను యథేచ్ఛగా చూపిస్తున్నా చర్యలు మాత్రం శూన్యం. కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ లొసుగులను సరిదిద్దడంలో కాలయాపన చేస్తున్నది అటు ప్రతిపక్షాలు, ఇటు కొన్ని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కేవలం సలహాలు, హెచ్చరికలు ఇవ్వడానికే పరిమితమైంది. గ్రౌండ్‌లెవల్‌లో నేరాలను అరికట్టేలా కఠినమైన క్రిమినల్ సెక్షన్లతో కూడిన ఓటీటీ చట్టం తీసుకురావడంలో కేంద్రం విఫలమైంది. ఓటీటీల్లో క్రైమ్, అశ్లీలత పెరిగిపోతుండటంతో 2024–25 నుంచి కేంద్ర ప్రభుత్వం కొన్ని రూల్స్ తెచ్చింది. మితిమీరిన హింస, మృతదేహాలను భయంకరంగా చూపించడం వంటి వాటిపై అభ్యంతరాలు వ్యక్తమైతే, సదరు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌పై జరిమానాలు విధిస్తున్నది. అడల్ట్ రేటింగ్ ఉన్న కంటెంట్ కోసం కేవలం క్లిక్ చేస్తే సరిపోదు. తప్పనిసరిగా ఆధార్ బేస్డ్ ఏజ్ వెరిఫికేషన్ లేదా కఠినమైన పేరెంటల్ లాక్ అమలు చేస్తున్నది. ఈ రూల్స్ ఏ మాత్రం ఓటీటీ కంటెంట్‌లోని క్రైమ్‌ను, అశ్లీలతను అడ్డుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.



## నేరాలకు 'మాన్యువల్'గా..

ప్రస్తుతం ఓటీటీ సిరీస్‌లు కథను మాత్రమే కాకుండా.. నేరం చేసే పద్ధతిని వివరంగా చూపిస్తున్నాయి. పోలీస్ ఇన్వెస్టిగేషన్‌లో దొరక్కుండా ఫింగర్ ప్రింట్స్ తుడవడం, సిమ్ కార్డులు మార్చడం, సీసీ టీవీ ఫుటేజీని డిలీట్ చేయడం వంటివి నేర్పే 'ట్యుటోరియల్స్'లా మారుతున్నాయి. డార్క్ వెబ్ వాడకం, బిట్ కాయిన్ ద్వారా లావాదేవీలు, లోకేషన్ ట్రేస్ కాకుండా వీపీఎన్ వాడటం వంటి సాంకేతిక నేరాలను ఓటీటీలు పరిచయం చేస్తున్నాయి. దేశంలో 65% కంటే ఎక్కువ థ్రిల్లర్/క్రైమ్ కంటెంట్ చూసే యువకులు, తాము ఆ కంటెంట్ ద్వారా ప్రభావితం అవుతున్నామని అంగీకరించారు. గత 5 ఏండ్లలో 'కాపీక్యాట్ క్రైమ్స్' (సినిమాలు చూసి చేసే నేరాలు) రేటు సుమారు 20% పెరిగింది.

### పన్నుల రూపంలో కేంద్రానికి ఆదాయం

ఓటీటీల నుంచి కేంద్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం వెళ్తుంది. ఓటీటీ సబ్ స్క్రిప్షన్లపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తుంది. నెలకు రూ.200 పే చేస్తుంటే.. అందులో సుమారు 36 రూపాయలు కేంద్ర ప్రభుత్వానికి ట్యాక్స్ రూపంలో వెళ్తాయి. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియో హాట్‌స్టార్ వంటి సంస్థలు భారత్‌లో సంపాదించే లాభాలపై ప్రభుత్వానికి ఇన్ కమ్ ట్యాక్స్ (కార్పొరేట్ ట్యాక్స్) చెల్లిస్తాయి. విదేశీ కంపెనీలు భారత్‌లో ప్రకటనల ద్వారా సంపాదించే ఆదాయంపై 'ఈక్వలైజేషన్ లెవీ' వంటి పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది.



## మీ పిల్లలు ఏం చూస్తున్నారో తెలుసా?




ఓటీటీల్లో మితిమీరిన బోల్డ్, క్రైమ్ కంటెంట్ వల్ల సమాజంపై, ముఖ్యంగా పిల్లల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం పడ్తున్నది. వీటిని చూసి కొందరు పిల్లలు సైకోలుగా మారిపోతున్నారు. దీనికి అడ్డుకట్ట వేయడానికి పేరెంట్స్ కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ప్రతి ఓటీటీ యాప్‌లో వయసు పరిమితిని సెట్ చేసే అవకాశం ఉంటుంది. 18+ కంటెంట్ పిల్లలకు కనిపించకుండా పిన్ లేదా లాక్ సెట్ చేయాలి.
- పిల్లల కోసం ప్రత్యేకమైన కిడ్స్ ప్రొఫైల్ క్రియేట్ చేయాలి. ఇందులో కేవలం కార్టూన్లు, విద్యా సంబంధిత కంటెంట్ మాత్రమే అందుబాటులో ఉండేలా చూడాలి.
- పిల్లలు ఫోన్‌లో ఏం చూస్తున్నారు? ఏ హిస్టరీ ఉంది? అనేది క్రమం తప్పకుండా గమనించాలి. వారు ఒంటరిగా ఉన్నప్పుడు కంటే, కుటుంబంతో కలిసి ఉన్నప్పుడు టీవీలో కంటెంట్ చూడటం ఉత్తమం.
- స్కూళ్లలో పిల్లలకు ఏది వాస్తవం, ఏది కల్పితం అనే విచక్షణ నేర్పించాలి. సినిమాల్లో చూపించే హింస నిజ జీవితంలో ఎంత ప్రమాదకరమో వివరించాలి.

**నేర స్వభావం కలిగిన క్యారెక్టర్లను హీరోలుగా భావించకుండా, నిజమైన రోల్ మోడల్స్ గురించి పిల్లలకు చెప్పాలి.**



### అశ్లీలతకు అడ్డా

ఓటీటీల్లో కేవలం షాక్ వాల్యూ కోసమే బూతులు, సెక్స్ సీన్లు పెడ్తున్నారు. ఇది క్రియేటివిటీ కాదు. ఓటీటీ ప్లాట్ ఫామ్స్ ఇప్పుడు పనికిమాలిన షోలకు చెత్తకుప్పగా మారాయి. ఇదొక దందాగా మారింది. పెద్ద పెద్ద నిర్మాణ సంస్థలు ఓటీటీలతో భారీ డీల్స్ కుదుర్చుకుని అశ్లీల కంటెంట్‌ను విపరీతంగా చూపిస్తున్నాయి.

– నవాజుద్దీన్ సిద్ధిఖీ, సినీ నటుడు

### గేట్ కీపర్ ఎక్కడ?

ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్‌లో ఎలాంటి సమాచారమైనా అందుబాటులో ఉంది. 12 ఏళ్ల పిల్లాడు ఫోన్‌లో టెర్రరిస్ట్ ఎగ్జిక్యూషన్ వీడియోలు, 9 ఏండ్ల పిల్లాడు పోర్న్ చూడగలిగే పరిస్థితి ఏర్పడింది. డిజిటల్ కాలంలో సెన్సార్ బోర్డు అనే వ్యవస్థే.. ఒక పెద్ద జోక్. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా, ఎలాంటి కటింగ్స్ లేకుండా అల్గారిథమ్స్ ద్వారా కంటెంట్ జనంలోకి వెళ్తున్నది. ఇవన్నీ ఆపడానికి గేట్ కీపర్ ఎవరున్నారు? సెన్సార్ బోర్డు ద్వంద్వ నీతిపై కలిసి పోరాడాలి.

– రాంగోపాల్ వర్మ, సినీ డైరెక్టర్





### జరిమానా వేయాలి

భారతీయ చిత్ర పరిశ్రమ నిర్మించే సినిమాల సంఖ్యతో పోలిస్తే ఓటీటీలో వచ్చే కంటెంట్స్ చాలా ఎక్కువ. ప్రతిదాన్ని విడుదల చేసే ముందే తనిఖీ చేయడం అసాధ్యం. ప్రభుత్వం ప్రతిపాదించిన నియంత్రణ మార్గాలు కేవలం కంటితుడుపు చర్యలుగా ఉన్నాయి. ఇవి అసలైన సమస్యను పరిష్కరించలేవు. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ తామంతట తామే స్వీయ నియంత్రణ అనుసరించడం మేలు. ప్రభుత్వం కేవలం 'పేరెంటల్ కంట్రోల్స్' వంటి కఠినమైన నిబంధనలపై దృష్టి పెట్టాలి. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు వేయాలి. – ప్రియాంక గాంధీ

### కట్టడి చేయాల్సిందే

ఓటీటీల్లో క్లీన్ కంటెంట్ ఉండాలి. అక్కడ చూపిస్తున్న అశ్లీలం, హింస, బూతులు భరించలేనంతగా ఉన్నాయి. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి చేతిలో ఫోన్ ఉంది. 15-16 ఏళ్ల పిల్లలు కూడా వీటిని చూస్తున్నారు. సెన్సార్‌షిప్ కచ్చితంగా ఉండాలి. మీ ఇంట్లో మీ పిల్లలకు ఇలాంటివి చూపిస్తారా? మరి ఓటీటీలో ఎందుకు అనుమతిస్తున్నారు? దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

– సల్మాన్ ఖాన్, సినీ నటుడు

